ప్రజాశక్తి

బుధవారం 2 ఆగస్టు 2023 5 శ్రీ సత్యసాయి

నేడు చంద్రబాబునాయుడు రాక

3న ఉమ్మడి జిల్లాలో పర్యటన



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాకు రానున్నారు. రాయలసీమ ప్రాజెక్టుల పరిశీలన యాత్రలో భాగంగా ఆయన పర్యటించనున్నారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు నాయకులతో కలిసి మంగళవారం నాడు పరిశీలించారు. చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి బస చేయనున్న ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. కర్నూలు, కడప జిల్లా నుంచి బుధవారం రాత్రికి అనంతపురం నగరానికి చేరుకుంటారు. 3వ తేదీన శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తారు. ఉరవకొండ వద్ద ఉన్న సామూహిక బిందు తుంపర సేద్యం ప్రాజెక్టు, అక్కడి నుంచి బిటిపికి ఎత్తిపోతల పథకం, పేరూరు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి సాయంత్రం చిత్తూరు జిల్లాకు వెళ్లనున్నారు.

విద్యుత్ సౌకర్యం లేని ల్యాబ్, బ్లడ్‌సెంటర్

అంధకారంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రి

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అత్యవసర విభాగాల్లో అంధకారం నెలకొంది. ల్యాబ్, ఎక్స్‌రే, బ్లడ్ సెంటర్ వంటి విభాగాల్లో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కదిరి చుట్టు ప్రక్కల 10 మండలాల నుంచి వచ్చే రోగులకు సకాలంలో వివిధ రకాలైన పరీక్షలు జరగక పోవడం కారణంగా హాస్పిటల్ కి వచ్చే సాధారణ మధ్య తరగతి పేద ప్రజలు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది.అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం వచ్చే వారికి బ్లడ్ నిలువ చేసే ఫ్రిడ్జ్‌లు కరెంట్ లేని కారణంగా పనిచేయకపోవటంతో తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీంతో ఫిమేల్ వార్డ్ లో ఉన్న ఫ్రిడ్జ్ లోకి రక్తపు నిల్వను మార్చాల్సిన దుస్థితి ఏర్పడింది. సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ తమకేం పట్టనట్లుగా వైద్యులు సిబ్బంది ఉండిపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రధాన ఏరియా ఆస్పత్రి దుస్థితి ఇలా ఉంటే ఇక మిగిలిన ఆసుపత్రుల పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో వైద్యుల, నర్సుల కొరత తీవ్రంగా ఉంది.అత్యవసర సేవలు సకాలంలో అందడం లేదు. చిన్న చిన్న సమస్యలకే ఇక్కడి వైద్యులు అనంతపురం, బెంగళూర్,తిరుపతి వంటి ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వైద్యాధికారులు తమ నిర్లక్ష్యం వీడాలని స్థానికులు కోరుతున్నారు.

సవితమ్మా... దిగజారుడు రాజకీయాలు మానుకో : ఎంపిపి

ప్రజాశక్తి-సోమందేపల్లి

టిడిపి నాయకులురాలు సవితమ్మ తన దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం అన్నారు. స్థానిక ఎంపిపి చాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపిపి మాట్లాడతూ మండలం పరిధిలోని ఈదుల బలాపురం గ్రామపంచాయతీ రేణుక నగర్ నందు ఆదివారం రాత్రి రైతు వెంకటేష్ మొక్కజొన్న పంటను దుండలు ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంపై టిడిపికి చెందిన సవితమ్మవచ్చి వైసిపి నాయకులు మీద నిందలు వేయడం తగదన్నారు. సానుభూతి కోసం ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని సూచించారు. విలువలతో కూడుకున్న రాజకీయాలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ తుంగోడు నారాయణరెడ్డి, ఈదుల బాలాపురం ఆదినారాయణ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ షేక్ ఇమామ్ వలి, గుడిపల్లి సర్పంచి గిరిజమ్మ నాగరాజు రావు, వెలదడకల సర్పంచి నిర్మలమ్మ శ్రీనివాస్ రెడ్డి, గుడిపల్లి అమరప్ప, తదితరులు పాల్గొన్నారు.

డిఐజిని కలిసిన వైసిపి సమన్వయకర్త దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గంలెఒ శాంతి భద్రతలపై తగిన చర్యలు తీసుకోవాలని నియోజక వర్గ సమన్వయ కర్త, ఇన్‌ఛార్జి దీపిక అనంతపురం రేంజ్ డిఐజి అమ్మి రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం అనంతపురంలో డిఐజి కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో జరుగుతున్న దొంగతనాలు, భూ కబ్జాలు, మట్కా, గ్యాంబ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించాడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పలు స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందని దీనిని తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డీఐజీ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిబ్బంది నియమకం విషయంలోను చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యలు సంతృప్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా చేపట్టిన జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగనన్న సురక్షతో ఇంటి వద్దనే 11 రకాల ప్రభుత్వ సేవలు పొందవచ్చన్నారు. ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేకుండా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 4,80,439 కి పైగా ప్రజలు సేవలు అందుకున్నారన్నారు. రాష్ట్రంలో జిల్లా మూడవ స్థానంలో ఉందన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని 544 సచివాలయాలు పరిధిలో గ్రామ సభలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారన్నారు.

కొండంత కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను పూర్తి చేసిన సాకే భారతికి పెద్దఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పేదరికంలో మగ్గుతున్న భారతి కుటుంబానికి తోడ్పాటు, సహకారం అందించేందుకు పెద్దఎత్తున మనసున్న వ్యక్తులు ముందుకొస్తున్నారు. ఆమె ఇంటికి నిత్యం అనేక మంది వచ్చి ఇన్ని కష్టాల్లో ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న ఆమె జీవితం ఒక ఆదర్శం అని చెబుతున్నారు. ఇంతటి ఆదరణ, అభిమానాలు వెల్లువెత్తుతున్న తరుణంలో ప్రభుత్వం వైపు నుంచి స్పందన కనిపించింది. ఆమెకు రెండు ఎకరాల వ్యవసాయ పట్టాను అందించారు. అయితే ప్రభుత్వం ద్వారా అందిని సాగుభూమి కొండలో ఉండడం... అది సాగుకు అనువుగా లేని పరిస్థితులు ఉండడంతో అందరూ ఇదేమి ఔదార్యం అంటూ నిట్టూర్పు విడుస్తున్నారు.

ఈ కొండలోనే సాకే భారతికి కేటాయించిన భూమి ఉంది

ఇదేమి సాయం..!?

◆ కొండలో సాకే భారతికి పట్టా ◆ 30 కిలోమీటర్ల దూరంలో భూమి ◆ ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాకే భారతి ఎస్‌కె యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి అందుకున్న తరువాత పెద్ద ఎత్తున ఆమె పేరు రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. కష్టాలను జయించి పిహెచ్‌డి తీసుకున్న ఆమెను అభినందిస్తూ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం కూడా ఆమెను గుర్తించింది. సోమవారం నాడు కలెక్టర్ గౌతమి ఆమెను పిలిపించి అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందని చెబుతూ రెండు ఎకరాల భూమిని ఆ కుటుంబానికి ఇస్తున్నట్టు ప్రకటించడమే కాకుండా పట్టానూ అందజేశారు. జూనియర్ అధ్యాపకురాలి ఉద్యోగం కాంట్రాక్టు పద్ధతిలో ఇస్తామని సాకే భారతికి కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇది చూసి అందరూ హర్షం వ్యక్తం చేశారు.

రెండు ఎకరాల వాస్తవ పరిస్థితి ఇది...

కలెక్టర్ గౌతమి చేతులు మీదుగా అందుకున్న రెండు ఎకరాలు ఎక్కడా అని ఆరాతీయగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. భారతి కుటుంబం ఉంటున్నది శింగనమల మండలంలోని నాగులగుడ్డం గ్రామం. ఇది గార్లదిన్నె మండల కేంద్రానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రభుత్వం ఇప్పుడు ఆమెకు ఇచ్చిన రెండు ఎకరాల పట్టా చూస్తే ఈ గ్రామం నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. నాగులగుడ్డం నుంచి శింగనమల అవతలు ఐదారు గ్రామాలు దాటి ఉంది. అది కూడా సరైనదా అంటే పైన కనిపిస్తున్న కొండ. అందులోనూ ఈ రెండు ఎకరాలు ఎక్కడుందో ఈ స్థలాన్ని గుర్తించిన అధికారులకే తెలియాలి. అక్కడికి పట్టాను తీసుకున్న తరువాత అంతదూరంలో భూమిని తాము ఏమి చేసుకోగలమని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఇందుకు అధికారులు 'మౌనంగా ఉండండి మీకు మీ ప్రాంతంలో మార్చి తరువాత పట్టా అందజేస్తాం'.. అంటూ అధికారులు వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేయడం గమనార్హం.



కొండగుట్టగా ఆన్‌లైన్‌లో కన్పిస్తున్న సాకే భారతికి కేటాయించిన భూమి వివరాలు

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం కావాలి : సాకే భారతి

తాను అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలన్నది తన లక్ష్యమని భారతి చెబుతున్నారు. అధికారులు మాత్రం తమ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడనికి జూనియర్ లెక్చరర్ పోస్టు ఒకటి గుత్తి సమీపంలో ఉందని చెబుతున్నారు. అక్కడ చేరుతామంటే ఇస్తామని చెబుతున్నారు. మరి ఉద్యోగంలో చేరుతారా అని అడిగిన దానికి భారతి స్పందిస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలన్నది తన ఆశయమని దాని కోసం ప్రయత్నిస్తానని చెబుతోంది. ఎస్‌కెయులో బ్యాక్‌లాక్‌లో పోస్టు ఖాళీగా ఉందని ఆమె చెప్పుకొచ్చింది. ప్రభుత్వాన్ని తాను కోరుతున్నది ఇదొక్కటే ఇంకేమి వద్దు... తనకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేస్తోంది.



తనకు కేటాయించిన భూమి పట్టాను చూపిస్తున్న సాకే భారతి

నిందితులకు శిక్ష పడేలా వ్యవహరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అధికారులు సమన్వయంతో పని చేసి దోషులకు శిక్షపడేలా చూడాలని ఎస్పీ కోరారు. జిల్లా పరిధిలో నమోదైన, రన్‌లో ఉన్న వివిధ వివిధ కేసుల గురించి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి దోషులకు శిక్షలు పడేలా వ్యవహరించాలని ఎస్పీ పేర్కొన్నారు.ట్రైల్ రన్ అవుతున్న 75 కేసులలో ప్రతి కేసు పూర్వాపరాలు, ప్రస్తుతం ఆ కేసుల స్థితి మొదలైన విషయాలు గురించి విపులంగా చర్చించారు. ముఖ్యమైన కేసుల్లో విచారణ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంయుక్తంగా కోర్టు హాజరై కేసులు వీగి పోకుండా దోషులకు కోర్టులో శిక్ష పడేలా వ్యవహరించాలని తెలియజేశారు. కోర్టులో ప్రవేశపెట్టే సాక్షులను కొన్ని రోజులు ముందుగా పిపి ద్వారా సాక్షం చెప్పడం పై వారికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా కోర్టు లో కేసులు విగిపోకుండ దోషులకు శిక్ష పడేలా వ్యవహరించవచ్చునని అభిప్రాయపడ్డారు. అలాగే క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన వారిపై కోర్టులో రిటర్న్ ఆర్గ్యుమెంట్ నమోదు చేయాలని తెలియజేశారు. ఫోక్సో లాంటి కేసుల విచారణ లో చిన్న చిన్న తప్పుల వల్ల కోర్టులో ఒకోసారి కేసులు వీగిపోయే అవకాశం ఉందన్నారు. విచారణలో ఉన్న కేసుకి సంబందించిన పూర్తి సమాచారం పోలీస్ సిబ్బంది పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, కోర్టు కానిస్టేబుల్‌గా విధుల్లో ఉండే సిబ్బందికి అయా కేసులపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. అవసరం అయితే తప్ప కోర్టు కానిస్టేబుల్‌ను మర్చుకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జిల్లా అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, జిల్లాలోని ఎస్ డిపిఒలు, సి ఐలు, ఎస్ఐలు, డిస్ట్రిక్ట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ కె.రామనాయక్, జిల్లా పరిధిలోని ఇతర పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హాజరయ్యారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

రిజర్వాయర్ వద్ద టిడిపి నాయకులు

టిడిపి హయాంలోనే అభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి- పెనుకొండ

టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు కృషితోనే గొల్లపల్లి రిజర్వాయర్ ను పూర్తిచేసే చేసి, సాగు,తాగు నీటిని అందించడం జరిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె. పార్థసారథి పేర్కొన్నారు. ఈనెల 3 తేదీన చంద్రబాబు పర్యటన నేపథ్యంలో మంగళవారం మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద ఏర్పాట్లను మాజీ మంత్రులు పరిటాల సునీతమ్మ, కాలవ శ్రీనివాసులుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి మాట్లాడుతూ రాయలసీమలో కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ప్రముఖ ఇంజనీర్ శివరామకృష్ణ సూచనల మేరకు హంద్రీనీవా పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆ తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి కొంత మేర పనులు చేశారని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించి 18నెలల్లోనే గొల్లపల్లి రిజర్వాయర్ ని పూర్తి చేసి కియా కార్ల పరిశ్రమను ఈ ప్రాంతానికి తీసుకురావడానికి కృషి చేశారన్నారు. తద్వారా ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. చంద్రబాబు కృషి తోనే ఈ ప్రాంతంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. ఇంకా 14 కియా అనుబంధ పరిశ్రమలు రావాల్సి ఉన్నా సిఎం జగన్,ఎమ్మెల్యే శంకర్ నారాయణ టాక్స్ లకు బయపడి ఇతర రాష్ట్రాలకు వెళ్ళాయన్నారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అనుబంధ పరిశ్రమల ను తీసుకువస్తామన్నారు. టీడీపీ తోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దయ్య, రవిశంకర్, లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, గొందిపల్లి సూరి, బాబుల్ రెడ్డి, శ్రీనివాసులు, గుట్టూరు నాగరాజు, శేషు, రమేష్, కమలాకర్, విశ్వనాథ్, సిద్దప్ప, హరి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ పనులు సత్వరమే పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ ప్రాంతాలలో చేపట్టిన భూసేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారులు రైల్వే, రీ సర్వే సంబంధించిన పనులు పురోగతిపై వేరువేరుగా ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రహదారులకు భూమిని సేకరించిన విషయంలో భూ లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లింపు జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం అమలు రీ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. చిలమత్తూరు టేకులేడు వద్ద ఇండస్ట్రియల్ పార్కుకు సంబంధించిన పనులు, పెనుకొండ మండలం గొంది పల్లి మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఇప్పటివరకు జరిగిన పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ఎన్ హెచ్ 342, 716 జి బెంగళూరు, కడప, విజయవాడ కు సంబంధించి అవార్డు పాస్ చేసిన భూములకు త్వరగతిన నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను జెసి ఆదేశించారు. రీ సర్వే పనులకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆధునిక పరిజ్ఞానంతో రీ సర్వే కి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో రెండో విడత 59 గ్రామాలకు గాను 27 గ్రామాల్లో 13 నోటిఫికేషన్ జారీ అయిందని మిగిలిన గ్రామాల్లో నోటిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రెండు వారాల్లోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, భూ సర్వే ఏడీ రామకృష్ణ, రైల్వే శాఖ డీఈ నాగభూషణ, ఎన్‌హెచ్ డి జగదీష్, పెనుకొండ, సోమేందేపల్లి, గోరంట్ల, పుట్టపర్తి, ధర్మవరం తహశీల్దార్లు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఆర్థికసాయం అందజేస్తున్నచిలకం

కిడ్నీసమస్యతో బాధపడుతున్న బాధితురాలికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి చేయూత నందించారు. పట్టణంలో 24వ వార్డు పార్థసారధినగర్‌కు చెందిన నారాయణస్వామి, హమావళి కుమార్తె విమల గత కొంతకాలంగా కిడ్నీసమస్యతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న చిలకం మధుసూదన్రెడ్డి మంగళవారం బాదితురాలి ఇంటికి వెళ్లి వైద్యఖర్చుల కోసం రూ.10వేలు ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి రొద్దం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తిమ్మయ్య, రెడ్డిపల్లి సర్పంచి రామాంజి, ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మారుతి రెడ్డి, సానిపల్లి సర్పంచి పరమేష్ తదితరులతో పాటుఅధికారులు పాల్గొన్నారు.

తనకల్లు : మండలంలోని ఉస్తినపల్లి, బొమ్మలకుంట, మండ్లిపల్లి, దళితవాడ, తనకల్లులో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఒక్క ఎకరాకైనా సాగునీరు ఇచ్చారా..?

మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధికారంలోకి వచ్చాక రాప్తాడు నియోజకవర్గంలో ఒక్క ఎకరాకైనా పూర్తి స్థాయిలో సాగునీరు ఇచ్చారా అని మాజీ మంత్రి పరిటాల సునీత రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ నెల 3వ తేదీన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆత్మకూరు మండలంలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆమె పార్టీ శ్రేణులతో మంగళవారం అనంతపురంలో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు పర్యటను విజయవంతం అయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నేతలతో చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తీరు చూస్తుంటే పేరూరు ప్రాజెక్టును ఆయనే కటేశాను అనేలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పేరూరు ప్రాజెక్టుకు రూ.10 కోట్లతో నీరు తెస్తానని చెప్పి ప్రగల్బాలు పలికారన్నారు. కాలవల తవ్వకం పేరుతో కోట్ల రూపాయలను వంకల పాలు చేసిన ఘనత ప్రకాష్ రెడ్డికే దక్కుతుందన్నారు. వర్షాధారంగా నీరు వస్తే అదికూడా ఆయనే తెచ్చానని గ్లోబెల్ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. తాము శాశ్వత ప్రాతిపదికన నియోజకవర్గానికి నిలిచిపోయేలా ప్రాజెక్టులు నిర్మించాలని భావించామని తెలిపారు. చంద్రబాబు నాయుడు గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించక పోయి ఉంటే కియా పరిశ్రమ కూడా వచ్చేది కాదని అన్నారు. నాలుగేళ్లుగా మీరు చేసింది ఏంటో చెప్పకుండా వైయస్ హయాంలో ఇంత చేసాం... అంత చేశాం అంటూ ప్రగల్బాలు పలుకున్నారన్నారు. కనీసం పనులు చేసిన సబ్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వారిని బెదిరించి డబ్బులు ఎగ్గొట్టారన్నారు. నాలుగేళ్ల వైసిపి పాలన ప్రజలకు ఒక శాపం లాంటిదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధిచెబుతారన్నారు.

ప్రాజెక్టుల పేరుతో టిడిపి మోసం

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అధికారంలో ఉన్నన్ని రోజులూ టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో ధన దోపిడీ చేసిందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నాడు అనంతపురంలోని ఆర్‌అండ్‌బి అతిథిగహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉందంటే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత హంద్రీనీవాను 40 టిఎంసిల సాగునీటి ప్రాజెక్ట్‌గా మార్చి మొదటివిడతగా జీడిపల్లి రిజర్వాయర్ వరకు పనులు పూర్తి చేశారు. ఆయన మరణానంతరం కాంగ్రెస్ పార్టీ హయాంలో 2012లో జీడిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు వచ్చాయన్నారు. అప్పట్లో పేరూరు జలసాధన సమితి పేరుతో పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటిని ఇవ్వాలని తాను ఉద్యమాన్ని తీసుకొచ్చానని గుర్తు చేశారు. కేవలం 10 కోట్ల రూపాయల ఖర్చుతో పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీళ్లు ఇవ్వొచ్చని టిడిపి అధికారంలో ఉండగా తాను అనేకమార్లు చెప్పాన్నారు. ఇదే విషయాన్ని చంద్రబాబు దష్టికి విలేకరులు కూడా తీసుకెళ్లారన్నారు. అయితే దీని గురించి పట్టించుకోలేదన్నారు. వైసిపి అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు ఒక టిఎంసి నీటిని కేటాయిస్తూ జీవో తెచ్చామన్నారు. దాతలు, రైతుల సహకారంతో పెన్నానదిలో 40 కిలోమీటర్ల కాలవ తవ్వించి పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం టిడిపి చేసింది శూన్యం అన్నారు. అలాంటి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు ప్రాజెక్టుల పరిశీలన చేసే అర్హత లేదన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పుట్టపర్తి, హిందూపురం, కదిరి మున్సిపల్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ కార్మికులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ యూనియన్ సిఐటియు నాయకులు, కార్మికులు పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. మంగళవారం కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.ఎస్. వెంకటేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ లు ఇవ్వాలని, జీవో 30 ని సవరించి వేతనాలు ఇవ్వాలని కోరారు.కరోనా సమయంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 7న కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రామయ్య, గోవిందు, పెద్దన్న, నరసింహులు, నాగార్జున, వెంకటేశ్, సాయి, వెంకటలక్ష్మి, అనితమ్మ, ఇంజనీరింగ్ కార్మికుల సంఘం నాయకులు రమేష్, గణేష్, రాంచాన్, పోతులయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించ పోతే జిల్లా కలెక్టరేట్, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి జగదీష్ హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు రీలే దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సిఐటియు పట్టన కార్యదర్శి నరసింహప్ప సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకుకార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించక పోతే ఈనెల 7వ తేదీన సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నాను చేపడుతామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించక పోతే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులతో పాటు కోశాధికారి ఆనంద్, రామచంద్ర, రామాంజప్ప, మంజునాథ్, గుర్నాథ్, చంద్ర, నరసింహమూర్తి, శివ కుమార్, శంకర, నాగేంద్ర, బాబయ్య, బాలాజీ, కవిత, ఓబులమ్మ, క్లాప్ డ్రైవర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యంలో... మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఊరేగింపుగా ఇందిరా పార్కు నుంచి ర్యాలీ చేపట్టి అంబేద్కర్ సర్కిల్ లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాలప్ప, ఈరప్ప, చలపతి, జబీవుల్లా, ఫక్రుద్దీన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో మంగళవారం కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్ చెల్లించాలని, క్లాప్ డ్రైవర్లకు రూ. 18500 ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జనార్దన, తిరుపాలు, బాలకృష్ణ, రాజు, సూరి, రామాంజులు, నరసింహ మూర్తి, రామాంజనేయులు, చెన్నకృష్ణ, రాజేష్, చంద్రప్ప, లక్ష్మన్న, సుమతి, సిఐటియు నాయకులు జి.ఎల్. నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, అంజనేయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మున్సిపల్ కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ముట్టడించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ తాలూకా ఇన్చార్జి పవిత్ర మద్దతు పలికారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు తాలూకా సిపిఐ ఇన్చార్జి పవిత్ర మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు బాలకృష్ణ, ఎల్లప్ప, పార్వతమ్మ, అన్నపూర్ణ, శ్రీనాథ్, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం హెచ్చరించారు. ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటును మూసివేసి అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో దళారి వ్యవస్థను రద్దుచేయాలన్నారు. కార్మికులకు ఆప్కాస్ నుండి తొలగించి 010 పద్దతి ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న జిల్లా కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎల్.ఆదినారాయణ, కార్యదర్శి అయూబ్ ఖాన్, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాలనాగార్జున, డివైఎఫ్ఐ బాలాజీ, పెద్దరెడ్డి, అనంతపురం నగర మున్సిపాలిటీ కార్మికసంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, ధర్మవరం మున్సిపల్ కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, చెన్నకేశవులు, గౌరవాధ్యక్షులు పుల్లన్న, కార్మికులు పాల్గొన్నారు.

మడకశిర, ధర్మవరం మున్సిపల్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

వసతిగృహంలో వైద్యశిబిరం

నల్లచెరువు : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ లో మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఐనుద్దీన్, ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి శరీరంపై మచ్చలు తదితర వాటిని పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అనారోగ్యంగా ఉన్న పిల్లలకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐనుద్దీన్, హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ, పిహెచ్‌సి వైద్య సిబ్బంది రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌ఎఫ్. నశ్రీన్ భాను, ల్యాబ్ టెక్నీషియన్ శంకర, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణ రెడ్డి, మున్న, ఆఫీస్ సబార్డినేట్ ప్రకాష్, ఆశాకార్యకర్తలు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సు

రొద్దం : ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో బాక్సంపల్లి , శ్యాపురం, కంబాలపల్లి తదితర గ్రామాలలో తల్లిపాల వారోత్సవాల పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి అరుణ , అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతి, లక్ష్మిదేవి, ప్రభావతి , ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సోమందేపల్లి : మండల పరిధిలోని సుద్దుకుంటపల్లి గ్రామానికి చెందిన మావుటూరు అంజనప్ప ఇంటిలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. జరిగిన సంఘటన తెలుసుకున్న తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వారి కుటుంబానికి నూతన వస్త్రాలు, కొంత ఆర్థిక సాయం అందించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త అనారోగ్య కారణంగా బాధపడుతూ ఉండగా ఆయన ఇంటి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట రమణ, ఆంజనేయులు, త్రివేంద్ర నాయుడు, సంజీవప్ప, సోమప్ప, లోకేష్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి

లేపాక్షి: యానిమేటర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని మండలంలోని యానిమేటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏరియా కో ఆర్డినేటర్ రామిరెడ్డి కి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలనుండి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యానిమేటర్లు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు అందజేత

రొద్దం : ఫ్లోరోసిస్ బారిన పడిన వారికి లంబార్ బెల్ట్ లు, నెక్ బెల్ట్‌లు, వాకర్లు మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ జగదీష్ బాబు తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఫ్లోరోసిస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య, వైద్యసిబ్బంది ప్రమీల, వాసుదేవరావు, పరుశురాం, ఎఎన్ఎం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - మడకశిర

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాయలసీమ ద్రోహి అనిమాజీ ఎమ్మెల్యే ఈరన్న విమర్శించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆగస్ట్ 3 వ తేదీన గొల్లపల్లి రిజర్వాయర్ పరిశీలనకు వస్తున్నారన్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను 'రాయలసీమ ద్రోహి జగన్ - పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు' పేరుతో ప్రజల ముందు పెట్టడానికి రాయలసీమ పర్యటనకు చంద్రబాబు వస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు పర్యటనలో రైతులు, యువత మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓబుల దేవర చెరువు : నారా చంద్రబాబు నాయుడు తోనే ఏపీకి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐటీఐలో మంగళవారం మండల పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. వైసిపి పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఈనెల 3న జరిగే చంద్రబాబు పర్యటను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, బోయపల్లి శివారెడ్డి,నిజాం ,మండోజి ఆరిఫ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్ డాక్టర్ జాకీర్, నిజాం, ఇర్షాద్ ,సునీల్ ,ఓబుల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కోరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3న గొల్లపల్లి రిజర్వాయర్ ను కియా కార్ల కంపెనీ పరిశీలించడానికి నారాచంద్రబాబు నాయుడు వస్తున్నారన్నారు. చంద్రబాబు పర్యటనలో అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడిబండ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, మడకశిర మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు మనోహర్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, జిల్లా వీరశైవా సాధికారిక సమితి అధ్యక్షుడు దుర్గేష్, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : టిడిపి అధ్యక్షులు చౌంద్రబాబునాయుడు పర్యటను విజయవంతం చేయాలని ఆపార్టీ స్థానిక నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 3న నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటిస్తున్నారన్నారు. ఆయన పర్యటనలో అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు మహబూబ్ బాషా, తోట నరసింహులు, నాగేంద్రప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు కోరారు. ఈనెల 3న నిర్వహించే పర్యటనలో పుట్టపర్తి నియోజకవర్గంలోనే టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కదిరి టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమ ద్రోహి అని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్మాన్ ఖాన్ విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఈనెల 3న కదిరిలో నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు.

శాంతి ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మణిపూర్ మారణహోమానికి వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

మణిపూర్ మారణ కాండకు నిరసనగా ఫాసిస్టు వ్యతిరేక కూటమి ఆధ్వర్యంలో మంగళవారం కదిరి పట్టణములో శాంతి ర్యాలీ చేపట్టారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ,బహుజన సమాజ్ పార్టీలు ఉమ్మడిగా నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగన్న, కదిరి డివిజన్ కార్యదర్శి ఇలియాజ్, నాయకులు రామచంద్రప్రసాద్, రాయుడు, సురేంద్ర బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచుకు అండగా ఉంటాం

హిందూపురం : హిందూపురం రాజకీయ చరిత్రలోనే ఎప్పుడు లేని విధంగా కురుబల ఆడపడుచుకు వైసిపి అవకాశం కల్పించిందని ఈమెకు కురుబలు అన్ని విధాలా అండగా ఉంటామని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు నియోజకవర్గ ఇన్‌చార్జి దీపికను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు హిందూపురం రాజకీయ చరిత్రలో మొట్ట మొదటి సారిగా ఒక మహిళకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వేణురెడ్డితో పాటు కౌన్సిలర్లు శివ, మహేష్ గౌడ్, కురుబ సంఘం నాయకులు కృష్ణగౌడ్, రామకృష్ణప్ప, అంజాలప్ప, రామాంజనేయులు, మంజునాథ్, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికను కలిసిన కురుబసంఘం నాయకులు

వికలాంగ అధికారుల పట్ల చిన్నచూపు తగదు

రాస్తారోకోలో పాల్గొన్న వికలాంగుల హక్కుల పోరాటసమితి నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో వికలాంగ అధికారుల పట్ల అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు విమర్శించారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో మంగళవారం జలవనురుల శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయం ముందు భాగాన ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. జల వనరుల శాఖలో పని చేస్తున్న జిల్లా అధికారి బి రాజశేఖర్ రెడ్డి వికలాంగుడు అనే కనికరం కూడా లేకుండా అతనిపై రాష్ట్ర డైరెక్టర్ జాన్ సత్యనారాయణ అనుచరిస్తున్న వైఖరి సరైంది కాదని అన్నారు. వికలాంగ ఉద్యోగుల విషయములో కొన్ని సడలింపులు ఉన్నా అతనిని శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేస్తానని బెదిరించారన్నారు. అనవసరంగా ఆయనకు మెమో ఇచ్చి మానసికంగా వేధిస్తున్నారి ఆరోపించారు. ఈ మధ్య జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని తిరుపతి నందు ఎస్వి యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి హాజరైతే ,పక్క జిల్లా అనంతపురంలో భూగర్భ జల అధికారి అనుమతి లేదని సమాన స్థాయి అధికారి అనుమతి తీసుకోలేదని మరలా మెమో ఇచ్చి వేధించారని అన్నారు. ఇలా రాష్ట్రంలో ఎంతోమంది వికలాంగ ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తున్న ఉన్నతాధికారుల పై ఎంక్వయిరీ కమిటీ వేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర డైరెక్టర్ జాన్ సత్యనారాయణ గోపాల్ ,సువర్ణ కుమార్ పై 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసి వీరి ముగ్గురి మీద చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ రెడ్డి కి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు షఫీ జిల్లా అధ్యక్షులు ఎం.కె రామాంజనేయులు, జల వనరుల శాఖ ఏడీ రాజశేఖర్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, ధనుంజయ, భూదేవి, దేవీబాయి, సురేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బత్తలపల్లి : మండల పరిధిలోని గుమ్మల్లకుంట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంజుల(30) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. అనంతపురం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో శ్రీ నివాసముంటున్న నాగార్జున, మంజుల దంపతులు తనకల్లు మండలం సీఆర్ పల్లికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగాగాయపడిన మంజుల కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.

షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పీఆర్టీ వీధిలో సోమవారం రాత్రి ఓ రెడీమేడ్ వస్త్ర దుకాణంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఈ ప్రమాదంలో దుకాణం దగ్ధమైంది. బాధితుడు చెలిమి రంగనాథ్ తెలిపిన వివరాలు... రంగనాథ్12 సంవత్సరాలుగా జీ-చి మెన్స్ వేర్ రెడీమేడ్ వస్త్ర దుకాణాన్ని ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజులాగేసోమవారం రాత్రి కూడా షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అయితే ఇంటికి వెళ్లిన గంటకు ఫోన్ వచ్చింది. దుకాణం నుంచి మంటలు వస్తున్నాయని చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో తనకు రూ.27లక్షల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు రంగనాథ్ తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఉద్యోగవిరమణ హోంగార్డుకు సన్మానం

పుట్టపర్తి రూరల్ : పదవీ విరమణ పొందిన హోంగార్డు షాదిక్ వలిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి మాధవరెడ్డి మంగళవారం సన్మానించారు. ధర్మవరంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న షాదిక్ వలి విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకొని అంకిత భావంతో విధులు నిర్వహించారని ఎస్పీ అభినందించారు. పదవీ విరమణ పొందిన సాదిక్‌వలిని అభినందించారు. హోంగార్డులు సేకరించిన తమ ఒక్కరోజు వేతనం రూ. 4,42,200ల విలువైన చెక్కును ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి పి.విజయ్ కుమార్, ఆర్‌ఐలు శ్రీశైలం రెడ్డి, టైటాస్, వెల్ఫేర్ ఆర్‌ఎస్‌ఐ రాజు, హోంగార్డులు పాల్గొన్నారు.

ధర్మవరం వాసికి రాష్ట్రస్థాయి ర్యాంకు

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణానికి చెందిన అంబటి త్రిలోక్ గాయిత్రి ఎమ్‌డి పాథాలజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించింది. పట్టణానికి చెందిన అంబటి త్రిలోక్ గాయిత్రి తిరుపతిలో శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజీలో, రుయాఆస్పత్రిలో 2020-23 బ్యాచ్ ఎమ్‌డి పరీక్షలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించిందని ఆమె తల్లిదండ్రులు వనిత, అంబటిత్రిలోక్ తెలిపారు.

సింగిల్ విండో ఛైర్మన్ల నియామకం

చిలమత్తూరు : మండలంలో మూడు చోట్ల పీఐసీ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. ఈ మేరకు మండలంలోని చిలమత్తూరు సింగిల్‌విండో ఛైర్మెన్ పి. దివాకర్ రెడ్డి సభ్యులుగా నవాబ్వలీఖాన్, నాగేనాయక్‌ను నియమించారు. అదే విధంగా కోడూరు కు సంబందించి ఛైర్మెన్‌గా ఆర్.హనుమంతరెడ్డి, సభ్యులుగా జింక సజ్జప్ప, వెంకటప్ప, సోమఘట్టకు సంబంధించి ఛైర్మన్‌గా ఎ. అమరనాథ్, సభ్యులుగా లక్ష్మిరెడ్డి, మాల ఆదినారాయణలను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పిఐసీ కమిటీ నియామకానికి సహకరించిన నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులకు ఛైర్మెన్లు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఓటరు గుర్తింపు కార్డు

ధర్మవరం టౌన్ : ప్రతి ఒక్కరికి ఓటరు కార్డు గుర్తింపు ఉండేలా తగినచర్యలు తీసుకుంటామని, ఓటరు సర్వే విజయవంతం అయ్యేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమంపై సమీక్షతోపాటు ప్రగతివివరాలను రాజకీయపార్టీల నాయకులకు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి లో ప్రతినెల పౌర్ణమి రోజు నిర్వహించే గిరి ప్రదర్శనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక రథాన్ని పుష్పాలతో అలంకరించి బాబా చిత్రపటాన్ని ఉంచి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ గిరి ప్రదర్శన గణేష్ గేట్ నుంచి బయలుదేరి గోకులం మీదుగా గణేష్ సర్కిల్, జానకి రామయ్య పెట్రోల్ బంకు, పెద్ద కమ్మవారిపల్లి చింత తోపు మీదుగా పుట్టపర్తికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో స్థానికులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

తుది ఓటర్ల జాబితా తయారీకి చర్యలు

హిందూపురం : పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే, స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024 కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టి పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5 వ తేదీన ప్రచురించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని తహశీల్దార్ హసీనా సుల్తానా కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి రమేష్‌తో కలిసి అఖిల పక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'చలో పుట్టపర్తి'ని విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 25న చేపట్టే చలో పుట్టపర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు అవుకు ఈశ్వరయ్య మాదిగ కోరారు. ఈ మేరకు మంగళవారం పుట్టపర్తి లోని సాయి ఆరామంలో జరిగిన కార్యక్రమంలో చలో పుట్టపర్తి కరపత్రాలను జిల్లా నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగ రాష్ట్ర కమిటీని, శ్రీ సత్య సాయి జిల్లా కమిటీని ఎంపిక చేశారు .

జయహో బిసి సభతో వైసిపిలో వణుకు

ధర్మవరం టౌన్ : జయహో బిసి సభతో వైసిపిలో వణుకు మొదలైందని తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల క్రితం టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేశ్ ఒంగోలులో నిర్వహించిన బీసీ సభ విజయవంతం కావడంతో వైసీపీలో వణుకు పుట్టిందన్నారు. సభకు వచ్చిన బీసీలను చూసి కొంతమంది వైసీపీ మంత్రులు ఫెయిడ్ ఆర్టిస్టులు అన్నారని, బీసీలను చులకనగా చూస్తే నాలుకలు తెగ్గోస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో జగన్‌రెడ్డికి బీసీలు గుర్తుకు వస్తారా అని ప్రశ్నించారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ

హిందూపురం : పట్టణంలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఈసీఈ చదువుతున్న విద్యార్థిని శ్రావణి (17) మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. మంగళవారం హిందూపురం పట్టణంలో పాలిటెక్నికల్ మహిళా కళాశాల సెకండ్ ఇయర్ ఎలక్ట్రానిక్ గ్రూప్స్ చదువుతున్న శ్రావణి అనే విద్యార్థిని అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, నాగభూషణ, జయచంద్ర కళాశాలకు వెళ్లి ప్రిన్సిపల్ హరీష్ బాబును కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని మృతిపై అన్ని కోణాలలో సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ప్రిన్సిపల్ హరీష్‌బాబు మాట్లాడుతు విద్యార్థిని శ్రావని మంగళవారం కళాశాలకు రాలేదని, తోటి విద్యార్థినులు కళాశాలకు రావాలని కోరినప్పటికి, తనకు అరోగ్యం బాగాలేదని చెప్పి కళాశాల వసతి గృహంలోనే ఉందన్నారు. అయితేఉదయం 11 గంటల సమయంలో కొంతమంది విద్యార్థినులు కళాశాల వసతి గృహానికి వెళ్లగా బాత్‌రూంలో శ్రావణి అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి తమకు సమాచారమిచ్చారన్నారు. వెంటనే జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించామన్నారు. అక్కడ విద్యార్థిని మృతి చెందిందని అన్నారు. శ్రావణి చదువుతో పాటు అన్ని విభాగాల్లోను చాల చురుకుగా పాల్గొనేదనిచెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.